# అమ్మ అత్త

\- చెన్ను సుశీలా రామం




సమయం ఉదయం పదకొండు గంటలైంది. శాంతమ్మ పూజగదిలో కూచుని ప్రశాంతంగా గాయత్రి మంత్రం చదువుకుంటూంది. ఉదయన్నే లేచి, టిఫిను, వంట చేసి... కొడుక్కి టిఫిన్, కాఫీ ఇచ్చి... భోజనం కేరియర్లో సర్ది... కొడుకు మహర్షిని పది గంటలకల్లా, ఆఫీసుకు పంపించి అప్పుడు పూజగదిలోకి వెళ్తుందామె. కొడుక్కి పెళ్ళి చేసి, కోడల్ని తెచ్చుకున్నా శాంతమ్మ దినచర్యలో మార్పేమీ రాలేదు.

కోడలొచ్చిన కొత్తల్లో కొత్త కోడలని పనులేవీ చెప్పలేదు. వెంటనే నెల తప్పి కోడలు మీనా వేవిళ్ళు పడుతుంటే అప్పుడూ మంచం దిగకుండా కోడల్ని ఎంతో అపురూపంగా చూసుకుంది. ఆ తర్వాత పురుడయ్యాక, చంటిబిడ్డ తల్లని, ఆ బిడ్డకు సంవత్సరం దాటకుండానే తిరిగి మీనా నెల తప్పిందని, ఆ తర్వాత బాలింతరాలని, ఇలా కోడలు ఇద్దరు బిడ్డల తల్లయ్యాక, నీ పిల్లల్ని చూసుకోమ్మా! అదే పది వేలు ... ఇంటిపని, వంటపని నువ్వు పట్టించుకోనక్కర లేదని కన్నతల్లి కంటే మిన్నగా చూసుకుంటోంది.

తనెంతో అదృష్టవంతురాల్నని మురిసి పోయేది మీనా. అర్థం చేసుకునే భర్త, అమ్మలా ఆదరంగా చూసుకునే అత్త దొరికితే ఏ ఆడపిల్లయినా అదృష్టవంతురాలే. ఆ పిల్ల జీవితం

పంచభక్ష్య పరమాన్నాలతో, వడ్డించిన విస్తరే. మీనా తల్లిదండ్రులకూ ఒక్కగానొక్క కూతురు. తండ్రికి బావుండలేదని తెలిసి భర్తతో కలిసి వెళ్ళింది. తండ్రిని చూసి వెంటనే భర్తతో కలిసి వచ్చేదామనుకున్నదల్లా నాలుగు రోజులు, కూతుర్నక్కడ వుంచమని ఆమె తల్లిదండ్రులు అల్లుడ్ని అడిగితే మహర్షి తన భార్యనక్కడ వదిలి వచ్చేశాడు.

కాలింగ్‌బెల్ మోత విని పూజగదిలోంచి లేచి వచ్చి తలుపు తెరచింది శాంతమ్మ. ఎదురుగా మహర్షి నిలబడున్నాడు. అతని ముఖం కళ తప్పి ఉంది.

"బాబూ! ఏమైందిరా? ఏంటీ ఈ వేళప్పుడొచ్చావు? ఆఫీసుకు శలవు పెట్టొచ్చావా? అదోలా కన్పిస్తున్నావు. ముందు లోపలికి వచ్చి కూచో. ఒంట్లోగాని నలతగా వుందా నాన్నా?" ఆదుర్దాగా కొడుకు చెయ్యిపట్టుకుని అడిగింది శాంతమ్మ.

లోనికొచ్చి హాల్లో ఉన్న సోఫాలో కూలబడ్డాడు మహర్షి. కొడుకు పక్కనే కూచుంది శాంతమ్మ. "అమ్మా మనం వెంటనే బైల్దేరాలి. మా మావగారు పోయార్ట. ఆఫీసుకి ఫోనొచ్చింది..."

"శివశివా... ఎలాంటి వార్త వినాల్సొచ్చింది? మొన్న నువ్వు చూసినపుడు బాగానే ఉన్నారు గదా! ఇంతలోకి ఇలా ముంచుకొచ్చిందా? అంతా ఆ పరమాత్ముడి లీల... పాపం మీ అత్తగారు ఎంత తల్లడిల్లిపోతోందో? మీనా పసిపిల్ల లిద్దరితోనూ ఎంత బెంబేలు పడుతోందో? ఉండు మనిద్దరివీ రెండు జతల బట్టలు బేగులో పెట్టుకొస్తాను. ఈ లోపు నువ్వు టాక్సీ మాట్లాడుకురా..."

"అలాగేమ్మా. ఈ లోపు నువ్వు కాస్త ఏదన్నా తిను. నీ పూజ అయినట్టు లేదు. అంటే నువ్వింకా టిఫిన్ కూడా చేసుండవు. టిఫినో భోజనమో ఏదో ఒకటి తినమ్మా. మళ్ళీ అక్కడికెళ్ళాక ఏ వేళవుతుందో? నీకసలే అల్సర్ ప్రాబ్లమ్ ఉంది కూడాను..."

"ఈ వార్త విన్నాక నాకు ఏవీ తినాలన్పించడం లేదు నాన్నా. ఒక్క పూటకి నేనేమై పోను గాని, ఇంక ఆలస్యం చెయ్యొద్దు నువ్వు" కొడుకుని తొందరపెట్టి టాక్సీకి పంపించింది శాంతమ్మ.

* * *

మహర్షి మామగారి, దినకార్యాలైపోయాయి. ఇంక కూతురు, అల్లుడు బైల్దేరుతామంటే గొల్లుమంది మీనా తల్లి దుర్గమ్మ. వియ్యపురాల్ని అక్కున జేర్చుకుని ఊరడించింది శాంతమ్మ. ఆమె అక్కడికొచ్చింది మొదలు దుర్గమ్మను వదలకుండా దగ్గరే ఉండి ఆమె మంచి చెడ్డలు

## నువ్వు - నీ నవ్వు

గుడిగంటలు మ్రోగినట్లు
గువ్వలజంట పాడినట్టు
సన్నజాజులు గంపలతో గుమ్మరించినట్టు
అనిపిస్తుంది నీ మాట వింటుంటే,
సరిగమల రథంపై సంగీత సామ్రాజ్యానికి
పయనమయినట్లు
వెన్నెలవానలో తడిసి ముద్దయినట్టు
అనిపిస్తుంది నీ నవ్వు చూస్తుంటే,
ఇంత అపురూపమైన
అనుభూతిని కలిగిస్తాయి గనుకే
నీ మాట విన్నా, నీ నవ్వు చూసినా
నన్ను నేను మరిచి
నేనే నీవైనట్లు, నీవే నేనైనట్లు
ఏదో తెలియని భావనా తరంగాల మధ్య
ఉక్కిరిబిక్కిరి అవుతున్నాను
ఇదంతా తెలియని నీవు మాత్రం
చిరుదరహాసం చిందిస్తూ నన్ను మురిపిస్తూ
మైమరపిస్తూ వుంటావు
ఇది నీకు న్యాయమా?!

\- రమ

చూసుకోసాగింది.

"వదినా మీరు ఇలా ఉంటే ఎలా చెప్పండి? మీరు ధైర్యంగా ఉండకపోతే మీనా మరీ బెంబేలు పడిపోతుంది. అమ్మా మీనా! మీ అమ్మ బట్టలు ఓ బేగ్‌లో సర్దు తల్లీ..."

అత్తగారి మాటలకు అర్థం కానట్టు చూసింది మీనా. "ఇక్కడ ఈ ఇల్లు ఖాళీ చెయ్యడం వగైరా వ్యవహారాలన్నీ తర్వాత నిదానంగా వచ్చి చక్కబెట్టుకోవచ్చు. అబ్బాయి రేపు ఆఫీసుకెళ్ళాలి గదా! అందరం ఈ రోజే బైల్దేరితే బావుంటుంది".

"వదినా! నన్ను మీతో మీ ఇంటికి తీసుకెళ్తానంటున్నారా? వద్దమ్మా వద్దు. కష్టమో సుఖమో ఇక్కడే పడుంటాను. కొడుకు దగ్గరుండటం పద్ధతిగా ఉంటుంది కానీ, కూతురింటి దగ్గరుండటం సబబు కాదు" దుర్గమ్మ ముక్కు ఎగబీలుస్తూ అంది.

"వదినా! మీరు అలా ఎప్పటికీ అనుకోవద్దు. కూతురేంటి, కొడుకేంటి? తల్లికి ఎవరైనా ఒకటే. మీ అల్లుడికి నేను తల్లినైతే నా కోడలికి మీరు తల్లి. మనిద్దరికీ మన పిల్లల దగ్గరుండే హక్కుంది. మన పిల్లలిద్దరికీ మనల్ని చూసుకోవాల్సిన బాధ్యతుంది. మీరింక మనసులో ఎలాంటి సందేహమూ పెట్టుకోకండి..."

వియ్యపురాలి రెండు చేతులూ పట్టుకుని కళ్ళకద్దుకుంది దుర్గమ్మ. "వదినా! మీదెంత మంచి మనసమ్మా! నా కూతురైనా అనని మాట మీరన్నారు. అయోమయంలో పడున్న నాకు నేనున్నానంటూ ఎంతో ధైర్యానిచ్చారు. మీకు నేను ఎంతో ఋణపడున్నాను".

"అయ్యయ్యో! మనలో మనకు ఋణాల మాటేంటమ్మా! మనమంతా ఒకే కుటుంబంలోని సభ్యులం. అది మర్చిపోకండి. ఏంటమ్మా మీనా! ఇంకా ఇక్కడే ఉన్నావా? వెళ్ళి అమ్మ బట్టలు సర్దు".

* * *

దుర్గమ్మకు కూతురింటి దగ్గర సుఖంగా గడిచిపోతోంది. కూతురు, అల్లుడు, మనవల మధ్య ఎలాంటి బెంగ, భయం లేకుండా నిశ్చింతగా బతుకుతూంది. వచ్చిన కొత్తల్లో వియ్యపురాలికి పనిలో కాస్త సాయంగా వెళ్ళేది. రానురాను అదీ మానేసింది. శరీరాన్ని సుఖానికి అలవాటు చేసింది. మనసుని చెడు ఆలోచనలకి ఆలవాలం చేసింది. కూతురికి అత్తగారిమీద చాడీలు చెప్పసాగింది.

"అమ్మాయ్! చూశావుటే నీ అత్త గడుసుదనం! పెళ్ళి కానంత వరకూ కొడుకుని తన కొంగుకు కట్టేసుకుని తన కనుసన్నల్లో ఆడించిందే అనుకో! పెళ్ళయ్యాక కూడా కొడుకునెలాగ తన చెప్పుచేతల్లో ఉంచుకుందో చూడు. మీ ఆయన ఆఫీసు నుండి వస్తూనే అమ్మా అంటూ వస్తాడు. ఆ తర్వాత అమ్మా కాఫీ ఇవ్వు, అమ్మా టిఫిను పెట్టు, అమ్మా భోజనం వడ్డించు ... ఇలా అమ్మ నామజపం చేస్తూనే ఉంటాడు. ఇదెక్కడి చోద్యమే తల్లీ? నెలంతా కష్టపడి సంపాయించుకొచ్చిన జీతం మొత్తం తెచ్చి అమ్మ దోసిట్లో పోస్తున్నాడు నీ మొగుడు. ఆలికేమన్నా అవసరాలుంటాయేమోనని ఏనాడన్నా ఒక్క రూపాయి నీ చేతిలో పెట్టిన పాపాన పోయాడా?

తల్లిని విసుగ్గా చూసింది మీనా. "అమ్మా ఏంటి నువ్వు మాట్లాడుతుంది? మా అత్తగార్నే వేలెత్తి చూపిస్తున్నావా? ఆవిడ చాలా మంచి మనిషి. ఆ విషయం నీకు మాత్రం తెలీదా?"

"హయ్యో నా పిచ్చి తల్లీ! నువ్వింత వెర్రిబాగుల్దానివి గనకనే నీ అత్త తన స్థానాన్ని ఈ ఇంట్లోనూ, నీ మొగుడి దగ్గరా అంత పటిష్టం చేసుకుంది. ఈ ఇంటి కోడలివి, యజమానురాలివి. ఏదన్నా నీ ఇష్టప్రకారం జరుగుతుందా ఇక్కడ? అన్నీ ఆవిడ ఆజ్ఞానుసారం జరిపించుకుంటూంది. పెత్తనం తన చేత పెట్టుకుని, అన్నీ కూతురికి మాటలు కట్టేస్తుంది. తల్లికెప్పుడూ కూతురిమీదే ఉంటుంది ఆపేక్ష. నువ్వెన్ని చెప్పు అత్త అత్తే. కోడలంటే ఏ మాత్రం అభిమానం

వుండదు. అత్త ఏనాటికీ అమ్మతో సరికాదు. నేను నీ క్షేమం కోరేదాన్ని. నా మాటలు పెడచెవిన పెట్టకు. ఇప్పటి వరకూ నువ్వేం పట్టించుకోలేదు. అసలు మీ ఆయన పుట్టినూర్లో పొలాలు, పుట్రలు, ఇళ్ళ స్థలాలు ఏ మాత్రం ఉన్నాయో, వాటి రాబడి ఎంతొస్తుందో నీకు తెలుసా? ఎప్పుడైనా, మీ ఆయన్ని అడిగి తెలుసుకున్నావా? హయ్యో నా రాతా... మీ ఆయనకు తెలిస్తేగదా నీకు చెప్పడానికి? మీరిద్దరూ ఇలాంటి వైరిబాగులాళ్ళు గనకనే నీ అత్త డబ్బు దస్కాన్ని కూతురికి చేరవేస్తూంది. ఆవిడున్నంత కాలం మీరిద్దరూ ఏం పట్టించుకోకండి. ఆ ముసల్ది కాస్తా హరీ అన్నాక చూసుకుంటే ఏం వుంటుంది? మీ చేతికి చిప్పా కర్రా వస్తాయి. పెద్దదాన్ని జీవితాన్ని కాచి వడపోసి ఉన్నదాన్ని. మీ క్షేమం కోరేదాన్ని గనక మీ గురించి ఇంతగా తాపత్రయపడుతున్నాను. నువ్వు కాస్త నిదానంగా ఆలోచించి బుర్రకెక్కించుకుని మీ ఆయన మెదడులోకి కూడా ఎక్కించు..."


అమృతం లాంటి మీనా మనసులోకి గరళం చుక్క విసిరి వెళ్ళింది దుర్గమ్మ. తుఫాను తాకిడికి గురైన సంద్రంలా అల్లకల్లోలంగా తయారైంది మీనా మనసు. చెప్పగా చెప్పగా బ్రహ్మకైనా పుడుతుంది రిమ్మ తెగులని తల్లి పదేపదే చెప్పే చెప్పుడు మాటలు మీనా మనసు మీద మత్తుమందులా పనిచెయ్యసాగాయి. మంచిని గ్రహించడానికి మనసు టైం తీసుకుంటుందిగాని చెప్పుడు మాటల్ని ఇట్టేపట్టేస్తుంది. మనసుని, తన చెప్పుచేతల్లో ఉంచుకోకుండా దాని చేతిలో కీలుబొమ్మయి పోయింది మీనా.

❊ ❊ ❊

ఆ నెల జీతం తెచ్చి తల్లి చేతికి యిస్తూన్న భర్తను అడ్డుకుంది మీనా. "అత్తయ్యా! ఇంతకాలం ఇంటి బాధ్యతలు భరించారు. ఇహనైనా అవన్నీ నాకు అప్పగించి మీరు రెస్టు తీసుకోండి. ఏంటండీ అలా చూస్తున్నారు? ఆ డబ్బు నా చేతికి ఇవ్వండి" చొరవగా భర్త చేతిలోంచి జీతం డబ్బు తీసేసుకుంది మీనా.

మహర్షి, శాంతమ్మ బిత్తరపోయి చూశారు. తేరుకున్న మహర్షి గొంతు విప్పాడు. "మీనా నీకేం తెలుసని, ఇంటి బాధ్యతలు చూస్తానంటున్నావ్? నాలుగు రకాల కూరలు సవ్యంగా కొనలేవుగాని మొత్తం ఇంటిపనులు చూసుకోగలవా?"

"ఎందుకు చూళ్ళేనండీ? అత్తయ్య ఉన్నారు గనక ఆమె చూసుకుంటున్నారు. అదే ఆవిడ లేకపోతే నేనేగా స్వయంగా చూసుకోవాల్సింది దాన్ని!"



### సల్మాన్ అభిమాని

*మాధురీ దీక్షిత్ ముంబయి వచ్చీ రాగానే సల్మాన్ జైలుకు వెళ్ళడానికి గల కారణాలను అడిగి మరీ తెలుసుకొని తన నైతిక మద్దతును సల్మాన్‌కు తెలియజేసింది. ఇదే సంజయ్‌దత్ విషయంలో ముఖం చాటేసింది. మాధురీ దీక్షిత్ 'హమ్ ఆప్ కే హై కౌన్' హీరో సల్మాన్‌తో హమ్ ఆప్‌కే ఫాన్ హై అనడానికి గల కారణాలు ఏమై ఉంటుందబ్బా? మాధురీ దీక్షిత్‌కు ఐస్ మీద ఉన్న ఈర్ష్య ఇందుకు కారణం అన్నది బాలీవుడ్ టాక్! 'దేవదాస్'లో మాధురి కంటే ఐస్‌కు ఎక్కువ పేరు వచ్చిందనే విషయం అందరికీ తెలిసిందే కదా!*

"అవునమ్మా! ఉన్న మాటన్నావు. నాకూ ఒంట్లో ఓపిక తగ్గిపోతుంది. కృష్ణా రామా అంటూ ప్రశాంతంగా ఓ ప్రక్కన కూచుంటాను. నువ్వీ బాధ్యతలు చూసుకుంటానంటుంటే అంతకంటే నాకు మాత్రం కావాల్సిందేవుంది? ఇది నీ సంసారం. జాగ్రత్తగా, సవ్యంగా చూసుకోమ్మా" శాంతమ్మ కోడలికి అన్ని జాగ్రత్తలూ చెప్పింది.

భర్త జీతం చేజిక్కించుకున్న మీనాకి కోతికి కొబ్బరికాయ దొరికినంత సంబరంగా ఉంది. శత్రువుల్నుండి సామ్రాజ్యాన్ని చేజిక్కించుకున్న మహరాణిలా గర్వంగా ఉంది ఆమెకు. ఇంక దుర్గమ్మ సంగతి సరేసరి. కూతుర్ని అడ్డం పెట్టుకుని చక్రం తిప్పేయాలని చూస్తుంది. తల్లీ కూతుళ్ళిద్దరూ షాపింగులని, సినిమాలని, షికార్లని తిరుగుతూ జీతం మొత్తాన్ని నెల మధ్యలోనే విచ్చలవిడిగా ఖర్చుపెట్టేశారు.

శాంతమ్మ పరిస్థితిలో మాత్రం మార్పేమీ రాలేదు. యథావిధిగా ఆవిడకు వంటపని, ఇంటిపని తప్పలేదు. దేనికీ మాట్లాడక, తన పని తాను చూసుకోసాగింది. అంతా గమనిస్తున్న మహర్షికి ఒళ్ళు మండసాగింది. దీనికి తోడు జీతం మొత్తం ఖర్చుపెట్టేసి నెలలో ఇంకా పదిహేను రోజులుండగా భర్తని డబ్బడిగింది మీనా.

సలుపుతున్న పుండుమీద కారం చల్లినట్లయింది మహర్షికి. "నీకు డబ్బు కావాలా? సరే. ఈ రాత్రికే ఏ బేంకు దోపిడీయో చేసి తెచ్చిస్తాలే".

భర్త వెటకారం మాటలకు కోపగించుకుంది మీనా. "ఏంటండీ అలా మాట్లాడతారు? నేనేదో దుబారా ఖర్చుచేసి, డబ్బు అవజేశాననుకుంటున్నారా? అంతా మనింటి కోసమే గదా వాడాను! కాకపోతే వచ్చేది శ్రావణ మాసం కదా... వరలక్ష్మీ పూజకు అప్పుడెలాగూ కొనుక్కోవాలి గదాని మొన్న బజారెళ్ళినప్పుడు బట్టల షాపు మీంచి వెళ్తుంటే షోకేస్‌లో బొమ్మకు కట్టిన శారీ నచ్చిందని కొనుక్కున్నాను. నాతో వుంది గదా అని మా అమ్మకొక్కానకపోతే బావుండదని తనకీ ఓ వెంకటగిరి శారీ కొన్నాను. వీధిలోకి, కార్పెట్టు అమ్మకానికొస్తే హాల్లో వేసుకుంటే బావుంటుందని ఓ కార్పెట్ కొన్నాను. ఎప్పట్నుండో మా అమ్మ ముచ్చట పడుతుందని పూజ సామాగ్రి వెండివి తీసుకున్నాను. పాపం! తనకు మాత్రం మనం తప్ప ఎవరున్నారు చెప్పండి?"

భార్య మాటల్ని మధ్యలోనే అడ్డుకున్నాడు మహర్షి. "మీనా నువ్వు ఏం కొన్నావో, ఎవరికి కొన్నావో అవన్నీ నాకు అనవసరం. జీతం మొత్తం తెచ్చి అమ్మ చేతిలో పెట్టడం నాకలవాటు. ఆవిడ ఎలా ఖర్చు పెడుతుందీ, ఏం చేస్తుందీ నేను పట్టించుకోను. తిరిగి జీతాలొచ్చే వరకూ నా దగ్గర డబ్బుండదు. మధ్యలో అమ్మ ఎప్పుడూ అడిగింది లేదు..."

"మీ అమ్మకు అవసరం లేదు గనక అడగలేదు. ఇప్పుడు నాకు అవసరం వచ్చింది గనక అడుగుతున్నాను. ఈ రోజే మీ ఫ్రెండ్స్‌ని ఎవరినైనా అప్పడిగి పట్రండి..."

భార్యను చిరాగ్గా చూశాడు మహర్షి. "అప్పా? ఇంత వరకూ నేనెవరి దగ్గరా చెయ్యి చాచి ఎరగను. ఇహ ముందు కూడా అంతే!..."

"బావుంది మీరు చెప్పేది. కాపురం అన్నాక ఎన్నో ఖర్చులుంటాయి. జీతం రాళ్ళు సరిపోకపోతే

ఎవరి దగ్గరైనా తెచ్చుకుంటుంటారు. తిరిగి తీర్చేస్తుంటారు. అసలు అప్పు చెయ్యకుండా ఎవరికి గడుస్తుంది? అప్పు చెయ్యని వాళ్ళెవరైనా ఉన్నారంటారా?'' లాజిక్కు మాట్లాడుతూ వాదనకు దిగింది మీనా.

"మీనా! ఇన్ని మాటలనవసరం. నేను ఎవ్వరి దగ్గరా అప్పు అడిగి తెచ్చే ప్రసక్తే లేదు. నా పాలసీ అది. అయినా ఇంతకాలం నేను తెచ్చిచ్చే జీతంతోనే ఇంట్లో ఏ లోటూ రాకుండా గడుపుకొస్తుంది అమ్మ. ఆ పని నువ్వెందుకు చెయ్యలేకపోయావ్?''

మీనాకి కోపం ముంచుకొచ్చేసింది. "మీ అమ్మ లాగా పీనాసితనంగా, గీచిగీచి ఖర్చు పెట్టాల్సిన ఖర్మ నాకు లేదు. అది నా వల్ల కాదు. నాకు సరదాలు, సంతోషాలు ఉన్నాయి. అయినా మీ జీతంరాళ్ళతోనే బతకాల్సిన అగత్యం మనకు లేదు గదండీ! మీ ఊళ్ళో మనకు పొలం, ఇల్లు ఉన్నాయి గదా! వాటిమీద వచ్చే రాబడి అంతా ఏం చేస్తున్నారు? ఓహో కూతురికి మూటగట్టి ఇచ్చేస్తుందన్నమాట మీ అమ్మ! ఏం మీ అక్కను కన్నట్టు మిమ్మల్ని కనలేదా మీ అమ్మ? పెంచి పోషించేది మనం, పెట్టుపోతలు మీ అక్కకీనా? ఇలా ఎంతకాలమండీ? మన పిల్లలు పెరిగి పెద్దవాళ్ళవుతున్నారు. మనకీ ఖర్చులు పెరుగుతున్నాయి. ఇంక చూస్తూ ఊరుకోవడం నా వల్ల కాదు''.

"నోర్ముయ్''. మెల్లగానైనా కటువుగా అన్నాడు మహర్షి. "మా ఊళ్ళో ఎస్టేటు లున్నాయనుకుంటున్నావా? మా చిన్నతనాన్నే మా నాన్న పోతే ఉన్న పొలాన్ని అమ్మి మా అక్క పెళ్ళికి, నా చదువు, ఉద్యోగానికి ఖర్చు పెట్టింది మా అమ్మ. మిగిలి ఉన్న ఇల్లు కూడా ఈ మధ్యే అమ్మింది''.

"అయితే ఆ డబ్బుండాలి గదా! బేంక్‌లో వేసుంచితే నెలనెలా వడ్డీ డబ్బు రావాలిగదా!''

"ఆ డబ్బు బేంక్‌లో వేసిందో, మరేం చేసిందో నాకు తెలీదు. అడిగితే దాని గురించి సమయం వచ్చినప్పుడు నేనే చెబుతానంది''.

"ఆవిడలా అంటే నోర్మూసుకుండి పోయారా? మా అమ్మ ముందు చూపు గలది కనుక ఇలా జరుగుతుందని ఎప్పుడో చెప్పింది. కాని ఏం లాభం? మన మట్టి బుర్రలకెక్కితే గదా? ఇల్లమ్మిన డబ్బు కాస్తా పట్టుకెళ్ళి కూతురి చేతిలో పెట్టింది. అందుకే మీరడిగితే మాట దాటేస్తుంది. ఇదెంత మాత్రం సహించన్నేను. ఇప్పుడే వెళ్ళి అడిగి, అటో ఇటో తేల్చేస్తాను. మొండికేస్తే పెద్ద మనుషుల్లో పెట్టి న్యాయమడుగుతాను. నన్ను, నా పిల్లల్ని బికారుల్ని చేసి కూతుర్ని అందలమెక్కిస్తుందా?'' కోపంతో మీనా ముఖం కందగడ్డలా మారింది.

"మీనా కాస్త నోరు మూస్తావా నువ్వు? మా అమ్మ అమ్మిన ఇంట్లో మనకెలాంటి హక్కూ లేదు. అది ఆమె పుట్టింటి వారిచ్చిన ఆస్తి. దాన్ని మా అమ్మ ఎవరికిచ్చుకున్నా, ఎలా వాడుకున్నా అడిగేహక్కు, నిలదీసే అధికారం ఎవరికీ లేదు''.

"అలాగా? అయితే ఇంక మీ అమ్మ మన దగ్గరెందుకుండటం? తిండి దండక్కి తప్పించి. వెళ్ళమనండి. వెళ్ళి తన ముద్దుల కూతురు దగ్గరే అఘోరించమనండి'' అంతకంతకూ రెచ్చిపోతూ అరుస్తూ పడగ్గదిలోంచి, హాల్లోకి వచ్చేసింది మీనా. విషయం తెలుసుకుని, కూతురికి వంత పాడ సాగింది దుర్గమ్మ.

దేనికీ నోరిప్పి పల్లెత్తు మాట మాట్లాడకుండా ఆ రాత్రి బండికే కొడుక్కి చెప్పి బైల్దేరి వెళ్ళిపోయింది శాంతమ్మ. ఇంటిపని, వంటపని ఇప్పుడు తల్లీ కూతుళ్ళిద్దరూ చేసుకోవాల్సి రావడంతో చాలా కష్టంగా నానా హైరానాగా ఉంది వాళ్ళకు. ఓ రోజు మధ్యాహ్నం నిద్రపోతున్న మీనాకు, మెలకువ వచ్చి లేచి ఇవతలకొచ్చింది. పెరట్లో తల్లి ఎవర్తోనో మాట్లాడ్డం వినిపించి కిటికీలోంచి చూసింది. కూతురు నిద్రపోతోందను కుని పక్కింటి బామ్మగారితో దుర్గమ్మ తన గోడు వెళ్ళబోసుకుంటూంది.

"ఏం చెప్పమంటారు పిన్నిగారూ నా బాధ?. ఎవరైనా వండి వడ్డిస్తే తినీ కూచుని విశ్రాంతి తీసుకోవాల్సిన వయసు నాది. వెనకా ముందూ ఎవ్వరూ లేక ఉన్న ఒక్కగానొక్క కూతురి దగ్గరకు పరుగెత్తుకొస్తే ఇక్కడ నా పరిస్థితి పనిమనిషి కంటే హీనమైపోయింది. ఇంటెడు చాకిరీ చెయ్యలేక ఈ పిల్ల పిశాచాల్తో వేగలేక నా ప్రాణం కొట్టుమిట్టాడుతోంది''.

"అదేంటి దుర్గమ్మా? ఇంట్లో పని చూసుకోడానికి నీ వియ్యపురాలు ఉందిగా? ఏంటీ కొడుకు తల్లినని, నీ మీద పెత్తనం చెలాయిస్తూ తను కాలు కదపకుండా నీతోనే పనంతా చేయిస్తుందా శాంతమ్మ?'' బామ్మగారు అడుగుతూంది.

"అదేం కాదు పిన్నిగారూ! ఆవిడగారికి ఇక్కడ తిన్నది అరగడం లేదల్లే ఉంది, కూతురి దగ్గరకు పరుగెత్తుకెళ్ళింది. వెళ్ళిందిగా... నాలుగు రోజులు గడిస్తే తనకే తెలిసొస్తుంది''.

"ఓహో! నువ్వు నీ కూతురి దగ్గరకొస్తే, శాంతమ్మ తన కూతురి దగ్గరకు వెళ్ళిందన్న మాట. పోన్లే అక్కడ నాల్రోజులు విశ్రాంతిగా ఉండొస్తుందిలే...' శాంతమ్మ విషయం తెలిసిన బామ్మగారు అంది.

"భలేవారే మీరు! ఆ కూతు రేవన్నా ఈ విడ్ని సవ్యంగా చూస్తుందను కుంటున్నారా? చూసునేమో! కాని ఎప్పుడు? తన వెనక ఏవన్నా మూట ఉంటే, అప్పుడు తల్లిని నెత్తినెట్టు కుంటుంది. కాని, శాంతమ్మ అలా చెయ్యలేదే! ఉన్నదంతా మూటగట్టి ముందే కూతురిపరం చేసింది. ఇంక ఇప్పుడు ఆవిడ దగ్గరేవుంది. బూడిద. ఇంక చూడండి ఆవిడ ఎక్కడున్నా కుక్క బతుకే'' చేతులు, మూతి తిప్పుతూ చెబుతూంది.

"ఓహో! అదా సంగతి? మరి నీ కూతురి మాటేంటి? మీ అమ్మాయి అలాంటిది కాదనుకుంటాను! నువ్వంటే పంచప్రాణాలను కుంటాను! అందుకే తండ్రి పోగానే నిన్ను వెంటబెట్టుకు తెచ్చుకుంది. అక్కడ నీకు సొంత ఇల్లు ఉందనుకుంటాను! ఇంక నువ్వు అక్కడికెళ్ళే పని లేదుగా. ఆ ఇల్లు అమ్మేసి డబ్బు

**నో నాచ్‌గానా**

సొట్టబుగ్గల సుందరి ప్రీతీజింతా విదేశాల్లో తాను నటించే పాటలను షూట్ చెయ్యవద్దని చెబుతోంది. ఆ పాటలను తీసెయ్యమని కానీ లేదా, వాటిని ఇండియాలోనే షూట్ చెయ్యమని కానీ, దర్శకులను కోరిందట. ఇంతకు ముందు విదేశాల్లో సైతం సాంగ్స్‌లో యాక్ట్ చేసిన ప్రీతీ ఇప్పుడు ఇలాంటి షరతులు పెట్టడానికి కారణం ఏమిటి? పాత సినిమా స్టైల్‌ను తిరిగి బాలీవుడ్‌లో ప్రవేశపెట్టి ఆ క్రెడిట్‌ను సొంతం చేసుకోవాలనా?



తెచ్చేసుకున్నావా?" ఆరాగా అడిగింది బామ్మ.


"ఇంకా నయం. మా వియ్యపురాలు చేసినటువంటి తెలివితక్కువ పని నేనెన్నటికీ చెయ్యను. నా దగ్గర డబ్బుందంటే నా కూతురు, అల్లుడు ఊరుకుంటారనుకుంటున్నారా? ఇచ్చే వరకూ జలగల్లా పట్టి పీడించరూ? ఇంటిని అద్దెకిచ్చేశాను. ఆ అద్దె డబ్బు ఏ నెలకానెల నా పేర్న బేంకిలో వేసుకుంటున్నాను. ఎవరు అరిచి గీ పెట్టినా దాన్లోంచి నయాపైసన్నా తియ్యను" ఖరాఖండిగా చెప్పేసింది.

"నీకు నెలనెలా రాబడొస్తుంది గదా! హాయిగా ఒక్కత్తివీ దర్జాగా ఉండొచ్చుగదా దుర్గమ్మా? ఇక్కడ మనవలకు చాకిరీ చేస్తూ ఉండడం ఎందుకు?"

"పిన్నిగారూ! నేను మీ అందర్లాంటి ఆడదాన్ననుకుంటున్నారా? నాకు ముందు చూపెక్కువ. వచ్చిన అద్దె డబ్బు వచ్చినట్లు ఖర్చుపెట్టుకు తింటూ కూచుంటే ఇంక నాకేం మిగుల్తుంది? అదే నేనిక్కడే వున్నాననుకోండి, నా అద్దె డబ్బు నాకు నెలనెలా పెరుగుతూ పదిలంగా ఉంటుంది. ఇల్లుకు ఇల్లూ ఉంటుంది. అప్పుడు అంతా నా దగ్గర పెంపుడు కుక్కల్లా అణిగి మణిగి పడుంటారు. ఈ రోజుల్లో ఎవ్వర్నీ నమ్మడానికి లేదు పిన్నిగారూ. కూతురేంటి? అల్లుడేంటి? మనవడేంటి? ముందుచూపుతో మన జాగ్రత్తలో మనం ఉండాల్సిందే. పిన్నిగారూ ఏదో నా మనసాగక మీరు నా తల్లిలాంటి వారు గనక నా మనసు విప్పి మాట్లాడాను. ఇప్పుడు నేనన్న మాటలేవీ మా అమ్మాయికి తెలీనివ్వకండేం? మన మనసులో ఏం వున్నా పైకి మాత్రం లౌక్యంగా మాట్లాడుతూ మన పబ్బం గడుపుకుంటూ బతకడమే తెలివిగల వాళ్ళ లక్షణం. అవునంటారా? కాదంటారా? పిన్నిగారూ. మరోసారి చెప్తున్నాను. నే మాట్లాడిందేవీ మా మీనాకి తెలియనివ్వకండి. అలా చేస్తే నన్ను చంపుకు తిన్నంత ఒట్టే..."

దుర్గమ్మ, బామ్మగారూ ఇంకా ఏవేవో మాట్లాడుకుంటూనే ఉన్నారు. కాని, అవేవీ మీనా చెవినెక్కడంలేదు. ఆమెకంతా అయోమయంగా... అది కలా నిజమా తేల్చుకోలేని పరిస్థితిగా ఉంది. తన తల్లి అలాంటిదని, ఆమె బుద్ధి అంత వక్రమైందని కల్లో కూడా ఊహించని ఆమె మెంటల్‌గా పెద్ద షాకే తింది. మెల్లగా, కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళి మంచంమీద వాలిపోయింది.

"అమ్మ నైజం ఇలాంటిదా? తన చెవులు తన్ని మోసం చెయ్యడంలేదు గదా! ఇక్కడ తన పరిస్థితి హీనంగా ఉందంటుందా? డబ్బు కోసం కూతురు, అల్లుడు జలగల్లా పీడిస్తారంటుందా? తన డబ్బు అంటూ వేరుచేసి మాట్లాడుతుంది. అంటే మా కంటే కూడా తనకి డబ్బే ఎక్కువన్న మాట! పైకి మాట్లాడే మాటలు ప్రవర్తించే తీరు అంతా నటనేనా? తల్లి ప్రేమలో కల్మషం ఉండదంటారే? మరి తన తల్లి? ఇంటెడు పనీ అత్తగారొక్కరూ చేసుకుంటుంటే తనుగాని అమ్మగాని సాయం వెళ్ళేవాళ్ళమే కాదు. కాని, ఏనాడూ ఆవిడ అమ్మలా విసుగు ప్రదర్శించలేదు. మనవల్ని ఎంతో ప్రేమగా సాకేది. ఇల్లమ్మిన డబ్బు తమకి ఇవ్వకుండా కూతురికిచ్చుకుందని నానా మాటలన్నాను. ఆవిడ, కూతురికైనా ఇచ్చింది కాని తన తల్లి? రాత్రే ఆయనన్నారు. తన ప్రమోషన్ గురించి కాస్త ఖర్చయ్యేలాగుందని మరేం పర్వాలేదు. అమ్మ ఇంటి మీద వచ్చే అద్దె డబ్బులుంటాయి. అమ్మనడిగి తీసుకుందాం అంది తను. కాని, కాని అమ్మ బుద్ధి ఇలాంటిదని తను ఊహించలేదు". వీధిలో పోస్ట్ అన్న కేక వినిపించడంతో తన ఆలోచన్లాపి నిస్సత్తువుగా లేచి వెళ్ళింది.




అది శాంతమ్మ, కోడలి పేర రాసిన ఉత్తరం. కవరు చించి చదువుకోసాగింది మీనా.

"చిరంజీవి సౌభాగ్యవతియగు మీనాను, మీ అత్తయ్య దీవించి రాయునది... అమ్మా మీనా! ఎలాగున్నావమ్మా? బాబులిద్దరూ ఎలా ఉన్నారు? మీ అమ్మగారేం చేస్తున్నారు? మహర్షి బాబు ఎలా ఉన్నాడు? అమ్మా మీనా! నేను ఎప్పుడూ నిన్ను భేదభావంతో చూడలేదు. కూతురుగానే భావించాను. అలాగే నువ్వూ నన్ను తల్లిగానే భావించుకుంటున్నావని అనుకున్నాను. కాని, మొన్ననే తెలిసింది. నీ మనసులో నా స్థానం చాలా అట్టడుగునుందని. అది నా దురదృష్టం. ఇహపోతే ఇల్లు అమ్మగా వచ్చిన డబ్బు నా కూతురికి ఇచ్చుకున్నానని గదూ నీ ఆరోపణ? లేదమ్మా. నీ ఆడబిడ్డ పిల్లాపాపా లేంది... అంతేగాక భార్యాభర్తలిద్దరూ సంపాదించుకుంటున్నారు. ఇంక అదేం చేసుకుంటుంది డబ్బు? ఇల్లు అమ్మగా వచ్చిన రెండు లక్షలు, నీకు, నీ పిల్లలిద్దరికీ తలకో యాభై వేలు ఫిక్సెడ్ డిపాజిట్టులో వేయించాను. వాటి తాలూకు పేపర్లు నా ట్రంకు పెట్టెలో ఉన్న పాత బట్టల అడుగునుంచాను. మిగిలిన యాభై వేలు నా పేర వేసుకుని దానిమీద వచ్చే వడ్డీ డబ్బు ఖర్చుపెట్టుకుంటూ వృద్ధాశ్రమంలో ఉందామని, నేను ఎప్పుడో నిర్ణయించుకున్నాను. నేనిప్పుడు వృద్ధాశ్రమంలోనే ఉన్నాను. మీరనుకుంటున్నట్టు కూతురింటికి వెళ్ళలేదు. నా పేర ఉన్న యాభై వేలు నా తదనంతరం వృద్ధాశ్రమానికి చెందేలా రాశాను. ఈ వయస్సులో నేను ఎవ్వరికీ భారంగా ఉండను. పిల్లలమీద మమకారం చంపుకోలేక, ఒంట్లో ఓపిక లేకున్నా ఇంతకాలం మీ దగ్గరుండిపోయాను. నేను తెలియక ఏవన్నా నీ మనస్సు ఒప్పిస్తే నన్ను క్షమించు తల్లీ. చిరంజీవులకు నా ఆశీస్సులు. మీ అమ్మగార్ని అడిగినట్టు చెప్పు. ఆ భగవంతుడు సదా మిమ్మల్నందరినీ చల్లగా చూడాలని ఆకాంక్షిస్తూ ఉత్తరాన్ని ముగిస్తున్నాను.

ఇట్లు,
శాంతమ్మ" ❃